ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఘట్‌కేసర్: తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగా ఎంపికైన నాగరి ప్రీతమ్‌ను ఘట్‌కేసర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో కలిశారు. సోమవారం వారి నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుమార్, బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, కౌన్సిలర్ మల్లేశ్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రాజు, బాలయ్య, సునీల్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేస్తున్న కౌన్సిలర్ అనితాసుధాకర్‌రెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ 9వ వార్డులోని భాగ్యనగర్‌కాలనీలో నివాసం ఉండే సిద్ధు గుండెపోటుతో మృతిచెందడంతో విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ కొమురెల్లి అనితాసుధాకర్‌రెడ్డి సోమవారం మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం మృతుడు కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. దీంతో పాటు కాలనీ అధ్యక్షుడు బీమానాయక్ కూడా మరో రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారని, ప్రభుత్వం వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.

కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం



సాక్షి, మేడ్చల్‌జిల్లా: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ), మీడియా సెంటర్‌ను మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ లాంఛనంగా ప్రారంభించారు. మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలను, ఎంసీఎంసీ పనితీరు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికలు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాస్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మోనిటరింగ్ కమిటీ సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికలు పారదర్శకంగా నిష్పక్షపాతంగా నిర్వహించడానికి మీడియా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి అరుంధతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ నాగాంజలి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు జాగ్రత్తలు పాటించాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: లోక్‌సభ ఎన్నికల సమయంలో బ్యాంకర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. జిల్లా కలెక్టరేట్లోని వీసీహాల్‌లో సోమవారం ఎన్నికల వ్యయమానిటరింగ్ సమావేశాన్ని బ్యాంకర్లతో నిర్వహించారు. బ్యాంకర్లకు, బ్యాంకు ఖాతాదారులకు ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిర్దేశించాలని కోరారు. నగదు రవాణా సమయంలో అవసరమైన మేరకు క్యూఆర్ కోడ్‌ను తప్పని సరిగా చూపించాలని అన్నారు. నగదు లావాదేవీలు, రవాణా చేసేటప్పుడు తగిన ఆధారాలతో జరగాలని నిర్దేశించారు. అలాగే, రూ.50 వేల కంటే ఎక్కువ ఉన్నట్లయితే అందుకు ధ్రువీకరణ పత్రం జతచేయాలని ఆయన సూచించారు. ఈ విషయంలో ఎలాంటి అనుమానాస్పద లావాదేవీలు ఉంటే రోజువారీగా నివేదిక సంబంధిత ఎల్డీఎంకు అందజేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు, జిల్లా బ్యాంకర్లు, నోడల్ అధికారులు, ఎన్నికల అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

పోచారం: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు బీజేపీ ప్రాధాన్యం ఇస్తుందని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ నుంచి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు బీజేపీ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు సురేష్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఈటల నివాసంలో కమలం గూటికి చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్న నమ్మకంతో ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరుతున్నారన్నారు. ఎన్నికల నాటికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఖాళీ అవుతాయన్నారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రంరెడ్డి, పార్టీలో కొత్తగా చేరిన సాయినాథ్‌గౌడ్, ప్రవీణ్ గౌడ్, సాయికుమార్, నవీన్, మహేష్, అనిల్, ఉమా మహేష్, రాఘవేందర్, సుధీర్, నాగేందర్, గణేష్, సాయిచరణ్‌ం జశ్వంత్, హరిబాబు,లోకేష్‌రెడ్డి, వివేక్, తరుణ్, శ్రీకాంత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులకు మేయర్ పదవిస్తారా..?

మండుటెండల్లో కాంగ్రెస్ కార్పొరేటర్ గాంధీగిరి

- ఆనాడు మల్లారెడ్డిని ఎదిరించి పోరాడాం..
- వారంతా.. అధికారం ఎక్కడుంటే అక్కడే..
- దొంగ చేతికి కాంగ్రెస్ పెద్దలు తాళాలు ఇస్తారా..?
- మేడ్చల్ కాంగ్రెస్ పెద్దలే సమాధానం చెప్పాలి
- మేయర్ ఎన్నిక అనంతరం మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, కార్పొరేటర్ నిహారికగౌడ్ ఎర్రటి ఎండలో నిరసన



జవహర్‌నగర్ కార్పొరేషన్ ఎదుట నిరసన చేస్తున్న మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, కాంగ్రెస్ కార్పొరేటర్ నిహారికగౌడ్

జవహర్‌నగర్: కలెక్టర్ షోకాజ్ నోటీసులు ఇచ్చి భూకబ్జాలకు పాల్పడిన వారికి మేయర్ పదవి అప్పగించడంపై కాంగ్రెస్ కార్పొరేటర్ నిహారికగౌడ్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్ మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజుల క్రితం వారంతా బీఆర్ఎస్ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూములను అమ్మి, జీవో 58, 59 ద్వారా, పేదలు ఇళ్లు కట్టుకుంటే లక్షల రూపాయలు వసూలు చేసే వారందరూ అధికారం ఎక్కడుంటే అక్కడికి వెంటనే కండువాలు మార్చి వాలిపోయే వారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తాము అప్పటి మంత్రి మల్లారెడ్డి అరాచకాలను ఎదుర్కొని అసెంబ్లీ ఎన్నికల్లో గట్టిపోటీ ఇచ్చామన్నారు. ఆనాడు డిప్యూటీ మేయర్ శ్రీనివాస్‌తో సహా ఇప్పుడున్న 26 మంది కార్పొరేటర్లు బీఆర్ఎస్‌లోనే ఉండి కాంగ్రెస్‌ను ఓడించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. వారి కబ్జాలను అప్పటి మంత్రి మల్లారెడ్డి దగ్గరుండి రక్షించారని, ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో వారి కబ్జాలకు అడ్డుపడతారని, మళ్లీ అవిశ్వాసం ముసుగులో ముందుకు వచ్చారన్నారు. అటువంటి వారికి మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పెద్దలు ఏవిధంగా తాళాలు అప్పగిస్తారని మండిపడ్డారు.

కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి తెచ్చారు..

మేయర్ పదవి కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేశామని చెప్పడం విడ్డూరంగా ఉందని, ఆ డబ్బులన్నీ ఎక్కడి నుంచి తెచ్చారని మండిపడ్డారు. ప్రభుత్వ భూములను అమ్మడంలో డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ దిట్ట అని వారందరికీ అతనే నాయకత్వం వహిస్తున్నారని మండిపడ్డారు. జవహర్‌నగర్‌లో వందల ఎకరాలను కబ్జా చేసి, 15 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఫామ్‌హౌస్ కట్టుకున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్‌ను కాంగ్రెస్ పెద్దలు ఇప్పుడు రక్షిస్తారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి భూములనే కాదు వీరి భూమలపై చర్యలు తీసుకోవాలి. వారం రోజుల క్రితం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ భూములను కబ్జా చేశారని, వాటిని కూల్చిన అధికారులు జవహర్‌నగర్‌లో మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు ఆక్రమించిన స్థలాలను స్వాధీనం చేసుకుని రక్షించాల్సిన అవసరం ఉందన్నారు.

కాంగ్రెస్‌లో గందరగోళం..

ప్రస్తుతం కాంగ్రెస్‌లో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఎన్నికలకు ముందు జవహర్‌నగర్‌లో మేయర్, డిప్యూటీ మేయర్‌తో సహా 26 మంది బీఆర్ఎస్‌కు చెందిన వారే ఉన్నారు. కేవలం 28వ డివిజన్ కార్పొరేటర్ కారింగుల నిహారికగౌడ్ మాత్రమే కాంగ్రెస్ పార్టీ.అవిశ్వాసం అనంతరం బీఆర్ఎస్‌కు చెందిన 18 మంది కాంగ్రెస్‌లో చేరడంతో పరిస్థితి విచిత్రంగా తయారైంది.

అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాల ఎదుట దీక్ష

కాంగ్రెస్ అధికారంలోకి రాకముందే తాము కాంగ్రెస్ కండువా కప్పుకుని పట్టణమంతా కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్‌తో కలిసి బీఆర్ఎస్ అరాచకాలపై పోరాడామని మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, కార్పొరేటర్ నిహారికగౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో నిజమైన కార్యకర్తలకు న్యాయం జరిగేవరకు దీక్షను కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్పొరేషన్ గేటు ఎదుట నిరసన చేసిన అనంతరం వారు అంబేడ్కర్ జగ్జీవన్‌రాం విగ్రహాల ఎదుట దీక్ష ప్రారంభించారు. జిల్లా, నియోజకవర్గ కాంగ్రెస్ పెద్దలు సమాధానం చెప్పేవరకు దీక్షను విరమించమని హెచ్చరించారు.

ఇంత అహంకారమా.. మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్

ఎర్రటి ఎండలో రోడ్డుపై కూర్చుంటే ఈ రోజు ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు కనీసం అటువైపు చూడకుండా వెళ్లిపోవడంపై తీవ్రస్థాయిలో మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్ మండిపడ్డారు. కాంగ్రెస్ గెలుపుకోసం అవిశ్రాంత పోరాటం చేశామని, ఇప్పుడు దొడ్డిదారిలో కోట్ల రూపాయలను కుమ్మరించి మళ్లీ అధికార పీఠం ఎక్కి వారి కబ్జాలను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, దీనికి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ నాయకులే సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

22 నుంచి జాతీయ స్థాయి క్రికెట్ పోటీలు

కీసర: చీర్యాల గ్రామ రెవెన్యూ పరిధిలోని పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలో ఈ నెల 22 నుంచి 24 వరకు జాతీయ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు టీ-10 క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.సందీప్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ శ్రీలత, చైర్మన్ కొమరయ్య తెలిపారు. పోటీల బ్రోచర్‌ను విడుదల చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి 8, తెలంగాణ రాష్ట్రం నుంచి 6 టీంలు పోటీల్లో పాల్గొంటాయని వివరించారు.

కీసర మండల ఎంపీఓగా నందకిషోర్

కీసర: కీసర మండల పంచాయతీ అధికారిగా నందకిషోర్ నియమితులయ్యారు. నందకిషోర్ ఘట్‌కేసర్ ఎంపీఓగా పనిచేస్తూ బదిలీపై కీసర మండల ఎంపీఓగా వచ్చారు. ఇక్కడ ఎంపీఓగా పనిచేసిన వినూత్నరెడ్డి మేడ్చల్ మండల ఎంపీఓగా బదిలీపై వెళ్లారు.

మల్లికార్జున స్వామి కల్యాణం



శామీర్‌పేట్: శామీర్‌పేటలోని మల్లికార్జున స్వామి కల్యాణం, జాతర యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగాయి. భక్తిశ్రద్ధలతో అగ్నిగుండాలు, బోనాలు, ఒడి బియ్యం భక్తులు సమర్పించారు. బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, పలువురు నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

అవినీతిపరులను పార్టీలోకి రానివ్వం



కాంగ్రెస్‌లో చేరుతున్న కౌన్సిలర్ మణికంఠగౌడ్

వజ్రేశ్ యాదవ్

మేడ్చల్‌రూరల్: అవినీతిపరులు, భూ కబ్జాదారులను కాంగ్రెస్‌లోకి రానిచ్చేది లేదని మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ మణికంఠగౌడ్ తన అనుచరులు, వందలాది మంది కార్యకర్తలతో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్, రాష్ట్ర నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఎమ్మెల్యే మల్లారెడ్డి తనకు కలిసిన వారందరికీ దండాలు పెడుతున్నాడని, రూ.వేల కోట్ల ఆస్తులు ఉన్న నీకు ఆ గతి ఎందుకు పట్టిందని అన్నారు. కబ్జాలు చేసి పేదల భూములు తిరిగి వారికి అప్పగించి, రూ.కోట్లు వెచ్చించి గెలిచిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి సీఎం రేవంత్ రెడ్డిని క్షమాపన కోరితే అప్పుడు తమ పార్టీ ఆలోచిస్తుందని తెలిపారు. అవినీతి పరులను తమ ప్రభుత్వం క్షమించేది లేదని హెచ్చరించారు. చాలామంది కౌన్సిలర్లు, కార్పొరేటర్లు తమకు టచ్‌లో ఉన్నారని, వారందరినీ ఆహ్వానిస్తామన్నారు. మల్లారెడ్డిని మాత్రం తరిమి కొడతామన్నారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. గతంలోనే ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు దేశ ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేశారని, పేదలకు అండగా నిలిచారని తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా ఎవరు ఎంపికైనా కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కోరారు.



మాట్లాడుతున్న వజ్రేశ్‌యాదవ్

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



మద్యం సీసాలతో పోలీసులకు చిక్కిన భాస్కర్‌గౌడ్

పోచారం: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోచారం పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సీఐ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విధి నిర్వహణలో ఉన్న ఎస్ఐ ఎం.శివ కృష్ణకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోచారంలోని ఓ ఇంటిని తనిఖీ చేశారు. ఆ ఇంట్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పోలు భాస్కర్‌గౌడ్ వద్ద ఆఫీసర్స్ ఛాయిస్ క్వార్టర్ సీసాలు 15, డెక్కన్ బ్లూ విస్కీ క్వార్టర్ బాటిళ్లు 38 లభించాయి. వెంటనే పోలీసులు అతడిని అరెస్ట్ చేసి, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు సీఐ తెలిపారు.

గుండెపోటుతో పెట్రోల్ ట్యాంకర్ డ్రైవర్ మృతి



కీసర: నాగారం ఎస్వీనగర్‌లోని పెట్రోల్ బంకులో ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి(53) ఆదివారం రాత్రి గుండెపోటుతో చనిపోయారు. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం కాటేదాన్ పరిధిలో నివసించే శ్రీనివాస్‌రెడ్డి ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్. ఆదివారం రాత్రి పెట్రోల్ బంకులో ఆయిల్ ట్యాంకర్ లోడ్‌తో వచ్చి లోడు ఖాళీ చేస్తుండగా వాహనం పక్కనే కూర్చున్న అతడు నేలపై బోర్ల పడిపోయాడు. అక్కడ ఉన్న ఇరుగుపొరుగు, పెట్రోల్ బంకు వారు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పెట్రోల్ బంకు సిబ్బంది పట్టించుకోకపోవడం వల్లే మృతి చెందాడని ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు, కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

పట్టు పడతాం.. ప్రగతి సాధిస్తాం..

జవహర్‌నగర్ నూతన మేయర్‌గా దొంతగాని శాంతికోటేష్‌గౌడ్



మేయర్ శాంతికి నియామకపత్రాన్ని అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి వెంకట ఉపేందర్‌రెడ్డి

జవహర్‌నగర్: పట్టుబట్టి ప్రగతి సాధిస్తామని జవహర్‌నగర్ కార్పొరేషన్ నూతన మేయర్ దొంతగాని శాంతికోటేష్‌గౌడ్ అన్నారు. జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మేయర్ ఎన్నిక నిర్వహించారు. ఈ మేరకు 18 మంది కార్పొరేటర్లు మేయర్‌గా శాంతికోటేష్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన మేయర్ శాంతిగౌడ్ మాట్లాడుతూ జవహర్‌నగర్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మేయర్ ఎన్నికకు ప్రత్యక్షంగా, పరోక్షంగా తనకు మద్దతు ఇచ్చిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత గ్రామపంచాయతీ హయాంలో తాను ఎంపీటీసీగా ఎన్నో సేవలు అందించానని, మళ్లీ మేయర్‌గా సేవలందిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. అన్ని పార్టీల నాయకులు అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ డబ్బులడిగితే గుంజకు కట్టేయండి

టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్



మాజీ సర్పంచ్, కార్పొరేటర్‌ను సముదాయిస్తున్న వజ్రేష్‌యాదవ్, నక్క ప్రభాకర్‌గౌడ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్‌లో కార్పొరేటర్ల అక్రమ దందాను నడవనివ్వమని, కార్పొరేటర్ పేదల ఇళ్ల వద్దకు వచ్చి డబ్బులు అడిగితే అక్కడికక్కడే గుంజకు కట్టేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, కార్పొరేటర్ నిహారికగౌడ్‌ల దీక్ష ప్రాంగణానికి వచ్చి మాట్లాడారు. కాంగ్రెస్‌లో నిజమైన కార్యకర్తలకు తప్పకుండా మంచి అవకాశాలను అధిష్టానం కలిప్తుందన్నారు. జవహర్‌నగర్‌లో ఇక భూదందా జరగనివ్వమని, ఇక్కడి నిరుపేదలు ఎంతోమంది 10 ఏళ్ల నుంచి జీవిస్తున్నారని, వారందరూ ఇంటి పక్కనో, ఇంటిపైనో స్లాబులు వేసుకుంటే డబ్బులివ్వాలని కొంతమంది కార్పొరేటర్లు వేధిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని ఇకపై అలాంటి ఘటనలు జరగన్వివమని, ఎవరైనా అక్కడి వచ్చి డిమాండ్ చేస్తే అక్కడే ఉన్న గుంజకు వారిని కట్టేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ కొత్తగా ఎవరైనా కార్పొరేటర్ ఎటువంటి అక్రమ దందా చేసినట్లు సమాచారం అందిస్తే తామే స్వయంగా వస్తామన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, కార్పొరేటర్ నిహారికగౌడ్‌లను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్‌తో కలిసి సముదాయించి దీక్షను విరమింపజేశారు.

మొదటి రోజు ప్రశాంతంగా టెన్త్ ఎగ్జామ్స్



పదో తరగతి పరీక్షలు మేడ్చల్ జిల్లాలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమ్యాయి. విద్యార్థులు పరీక్షా సమయం కంటే ముందుగానే కేంద్రాలకు చేరుకోగా సిబ్బంది వారిని తనిఖీ చేసి లోనికి అనుమతించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా సెంటర్లలో అన్ని ఏర్పాట్లు చేశారు.

డబ్బులడిగిన జూనియర్ అసిస్టెంట్ రమేష్ సస్పెన్షన్

ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కీసర తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి పథకంలో డబ్బులు (లంచం) అడిగిన జూనియర్ అసిస్టెంట్ ఎ.రమేష్‌ను సస్పెండ్ చేస్తూ.. సోమవారం కలెక్టర్ గౌతమ్ ఆదేశాలు జారీ చేశారు. మీట్ ది మీడియా సమావేశంలో కీసర తహసీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకున్న విషయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. ఈ నేపథ్యంలోనే కీసర ఆర్డీవో ఈ ఘటనపై విచారణ నిర్వహించారు. ఇందులో కీసర తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.రమేష్ కల్యాణలక్ష్మీ విషయంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆర్డీఓ విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ గౌతమ్ జూనియర్ అసిస్టెంట్ రమేష్‌ను సస్పెండ్ చేశారు. రమేష్ గతంలో కామారెడ్డిలో వీఆర్ఏగా పనిచేశారు. వీఆర్ఏ నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా కన్వర్ట్ చేయగా, కీసర తహసీల్దార్ కార్యాలయంలో పోస్టింగ్ పొందారు.

ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

మల్కాజిగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్

- ఏప్రిల్ 18 నుంచి 29 వరకు నామినేషన్ల ఘట్టం
- మే 13న ఎన్నికలు.. జూన్ 4న ఓట్ల లెక్కింపు
- ఏప్రిల్ 15 వరకు ఓటరు నమోదు.. మార్పునకు అవకాశం

సాక్షి, మేడ్చల్‌జిల్లా: కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సాధారణ లోకసభ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకారం అందించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ కోరారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం సాధారణ లోకసభ ఎన్నికల నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ లోకసభ సాధారణ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిందని, దీనికి సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న జారీ అవుతుందని ఆయన గౌతమ్ తెలిపారు. లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏఆర్‌ఓలను కూడా నియమించినట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఏప్రిల్ 26న నామినేషన్ల స్క్రూట్నీ, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్న అభ్యర్థుల నామినేషన్ పత్రాలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనే స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుందని అన్నారు.

◆ ఓటరు జాబితా ప్రకారం 8 ఫిబ్రవరి 2024 నాటికి మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 37 లక్షల 28 వేల 417 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఇందులో 15,117 మంది 85 సంవత్సరాల వయస్సుకు పైబడిన ఓటర్లు ఉండగా, 26,119 మంది దివ్యాంగులు ఉన్నట్లు తెలిపారు. వీరందరికి ఫారం-12డి ద్వారా హోం ఓటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు.

◆ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో తమ పేరు సరి చూసుకోవాలని, జాబితాలో పేరు లేని వారందరూ ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని ఆయన తెలిపారు.

◆ ఓటరుకు రెండు కిలోమీటర్ల రేడియస్‌లో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. అర్బన్‌లో 1500 నుంచి 1600 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, గ్రామీణ ప్రాంతంలో 1500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అమల్లోకి ఎన్నికల కోడ్..

◆ శనివారం నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

◆ రాజకీయ పార్టీలకు, నాయకులకు సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం సువిధ యాప్ ద్వారా అనుమతులు ఇస్తామన్నారు. ప్రతిరోజూ రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్‌స్పీకర్లు వినియోగించడానికి వీలులేదని తెలిపారు. రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాల్లో, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో నిర్వహించరాదని అన్నారు.

◆ ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసీసీ, సర్వేలెన్స్ బృందాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్సు బృందాలను, ఎంసీఎంసీ కమిటీ, వ్యయ పర్యవేక్షణ తదితర కమిటీలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెంబర్ 1950

◆ ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ఫిర్యాదులను ప్రజలు 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా, సి-విజిల్ యాప్ ద్వారా చేయవచ్చని అన్నారు. కలెక్టరేట్లో ఫిర్యాదులు స్వీకరించేందుకు 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో డీపీఆర్ఓ అరుంధతి, వివిధ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.